


అల్లుళ్ళ పండగలు !

సొంత పనుల మీదొచ్చి మనింట్లో మకాం పెట్టిన బంధువుల్తో ఎంత చిరాకో, నెలకోటి చొప్పున వచ్చిపడే పండుగలు కూడా అంత ఖంగారు పెడతాయి. ఈ బంధువులకీ, పండగలకి ఏదో అవినాభావ సంబంధ ముందని నాకో డవుటు. ఎవరైనా తెలిసిన వాళ్ళని కనుక్కోవాలి. ఈ నెల్లో దసరా తర్వాత దీపావళి వచ్చేస్తోంది. రెండూ రెండే, ఖరీదైన పండుగలు. ఒకే నెల్లో తగులుకుంటున్నాయి. మన బడ్జెట్ ని ఆ దేవుడే ఆదుకోవాలి.

బంధువులలో అల్లుళ్ళు ప్రముఖంగా నిలుస్తారు. పండగంటే చాలు జీతం నష్టమ్మీద సెలవులు పెట్టేసి దిగిపోతారు. నిన్న మొన్న పెళ్ళయినవాళ్ళ

యితే పోల్లే పాపమని సరిపెట్టుకోవచ్చు. పుష్కరంక్రితం పెళ్ళయిన శాస్త్రీలు సైతం అత్తవారింటి మీద ఆశలు పెట్టుకుంటే ఆ మామగారి గతేం కాను? పిల్లా మేకతో పదిమంది దిగుమతై పోతారు. ఇల్లు చాలకపోతే కిటికీ లెక్కుతారు. కొంపలెక్కుతారు. సట్టింట చెడుగుడు ఆడేస్తుంటారు. అలాంటి అల్లుళ్ళకి చేతులు జోడించాలో, జోలి పట్టాలో అఖిలాంధ్ర మావలకు వదిలేస్తున్నాను.

అందరు అల్లుళ్ళూ అదృష్టవంతులని నేను గ్యారంటీ యివ్వలేను. ఈ జాతిలో కూడ రెండు రకాలున్నాయి. మావ కూతుర్ని చేసుకున్నవాడు ఎప్పటికీ అల్లుడే. కడు స్వతంత్రుడు. పండుగపూట వస్తాడు. ప్రాణాలు తీస్తాడు. కొందరు అక్క కూతుర్ని చేసుకుంటారు. ఆ బాపతు జనాభాకి బావలుంటారే గాని మావలుండరు. పిల్ల నిచ్చిన బావగారే పండగపూట బావమరిదింటి కొచ్చి ఇది నా అత్తవారిల్లంటాడు. సేవలు చేయమని నోటీసు జారీ చేస్తాడు. పిల్లనిచ్చి యింకా అల్లుడిగానే చెలామణి అవుతున్న ఆసామితో గొడవ ఇంతా అంతా కాదని మొన్న దసరా రోజున తెలుసుకున్నాను. స్వానుభవం కనక సహృదయులు నమ్మి తీరాలి. అంచేత అల్లుడి దర్జా అనుభవించాలంటే ఎక్కడో మావ కూతుర్నే చేసుకోవాలి. అది రూలు. అక్క కూతుర్ని చేసుకున్నారో మీ కలాంటి ఛాన్సు లేకపోగా మీ బావగారే మీ యింటికొచ్చి అలకపాన్పు ఎక్కుతాడు. తర్వాత మీ యిష్టం.

అల్లుళ్ళ పుణ్యమాని మనకి పండగలు చాలా తరచుగానే వస్తుంటాయి. ఆ వచ్చే పండుగలేవో నెల మొదట్లో వస్తే బావుండు. గురి చూసి మధ్యనొకటి, నెల చివర్లో ఒకటి వస్తే దుంప తెగిపోతుంది. చేతిలో వుండేది అంతంతమాత్రం. ఖర్చులిస్టేమో కొండవీటి చాంతాడు. రెండుపండగల్ని సలక్షణంగా పంపించాలంటే తప్పకుండా అప్పు చేయాలి. అల్లుళ్ళు కూడా తగులుకుంటే ఆ అవస్థ వర్ణనాతీతం.

దసరా వెళ్ళింది గదాని గాలి పీల్చుకుంటే సరిపోదు. దీపావళి వచ్చేస్తోంది ఖబడ్దార్! చిట్ ఫట్ మోతలతో దీపావళి సాక్షాత్తు గుండెలలోనే టపాకాయల్ని పేల్చుతుంది. దాచుకున్నదీ, అప్పు చేసిందీ మొత్తాన్నీ తగలేసి

కసి తీర్చుకుంటుంది. ఖర్చుకి భయపడి టపాకాయ లడక్కండిరా బాబూ వాటి బదులు జోకులు పేల్చుకుందామంటే కుర్ర వెధవ లూరుకుంటారా? ఊరు కోరు. రోజూ నీ జోకులు వినలేక ఛస్తున్నాం. పండుగపూట కూడా విన మంటే మా చేతకాదని మారాం చేస్తారు. మగ పిల్లలు కదా, భారీ ఎత్తున తగలేసుకోడం ఒక క్వాలిఫికేషన్. అల్లాంటప్పుడు వాళ్ళ ముచ్చటకి బ్రేకులేసి ఏం ప్రయోజనం?

దసరా సరదాలు అనుభవిచేం. ఇంట్లో వాళ్ళ గొడవతోపాటు బయట జనాభా 'మామూళ్ళ' గోల ప్రాణాలు తీసింది. సైకిల్‌కి గాలికొట్టేవాడు, తల నరికేవాడు, ఆఫీసు ఫ్యూనూ, మునిసిపాలిటీ మనిషి, ఉత్తరాలు తెచ్చే పోస్టు మేనూ, ఒక్కరేమిటి ఈ మామూలు వీరుళ్ళు క్యూలో నిలబడి అదరగొట్టే శారు. అక్కడికి మనమేదో చక్రవర్తులమైనట్లు ఫోజు పెట్టేమేగాని చేతి చమురు ఎంత వదిలిందీ తల్చుకుంటే భయమేస్తోంది.

ఈ మమూళ్ళన్నీ ఒక ఎత్తు. బడిపిల్లల యుద్ధం ఒకటీ ఒక ఎత్తు. కొత్త బట్టలతో చిరునవ్వులతో, చేతిలో విల్లంబులతో పసి వెధవులు రామ దండులా యింటిమీద దాడి చేసేరు. వాళ్ళకి స్వపర భేదాలుండవు. సొంత యింటిమీద కూడా అదే విధంగా దాడి చేస్తారు. అయ్యవారికి చాలు ఐదు వరహాలు....పిల్లవాళ్ళకి చాలు, పప్పు బెల్లాలంటూ లెక్కలు చెప్పేరు. బళ్లో ఏం చదువుతారో గానీ, వాళ్ళ వీర ప్రతాపమంతా గొంతులు చించుకుని ఇళ్ళళ్ళో ప్రదర్శించేరు. అందులో కొందరివి కీచుగొంతులు, కొన్ని బండగొంతులు. కొన్ని నత్తివి, కొన్ని నాజూకువి. ఈ రకరకాల గొంతులు కోరస్ పాడుతుంటే ఇంటి కప్పు లేచిపోవాల్సిందే. ధరసింహాసనమై, నబంబు గొడుగై అంటూ నట్టింట బాలవాక్కు బ్రహ్మాండంగా వినిపిస్తుంటే ఆనందం గానే వుంటుంది. ఆ పక్కనే ఆసామి గుండెల్లో రైళ్ళు పరుగెడుతూనే వుంటాయి. డబ్బుల్లేదంటే ఆ యింటి వారబ్బాయికి పదుగురిలో అవమానం. ఇచ్చి పంపుదామంటే పర్సు పర్మిట్ చేయదు.

అప్పిచ్చినవాడ్ని కాలో చెయ్యో పట్టుకుని బతిమాలి పంపించ వచ్చు. వీళ్ళ అప్పు కాలూ చేయి బేరాలతో లొంగదుగాక లొంగదు. రేపురా మాపురా మళ్ళీ రమ్మనకంటూ దండకం చదివే పసివాళ్ళను ఏ ఆయుధ ముపయోగించి పంపించాలో తెలీక ఇంటాయన బెంబేలు పడిపోవడం కూడా మామూలే. ఆ అడిగేదేదో మేష్టరే అడిగి వుంటే నెక్స్ట్ వీక్ చూద్దాంలేండని లౌక్యం ఉపయోగించి పంపించ వచ్చు. ఈ ట్రిక్కులు మేష్టర్లకి తెలుసును గనకే వాళ్ళు పసి వెధవల చేతులలో విల్లంబులుంచి ఉసిగొల్పు తున్నారని మనం అర్థం చేసుకోవాలి. ఎంతైనా మేష్టర్లు గదా ఆపాటి మేధావితనం వాళ్ళ సొత్తు. కాదంటే ఎట్లా చెల్లుతుంది చెప్పండి. అన్నట్టు....

దసరా వెళ్ళగానే దీపావళి వచ్చేస్తోంది. దసరా కొచ్చిన అల్లుళ్ళు దీపావళి చూసిగాని కదలమని పంతం పండితే....వారి తాలూకు మావలు వారి వారి అత్తారిళ్ళకు పారిపోవలసిందిగా నేను ముందరే మనవి చేసుకుంటు న్నాను.